I

సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం, 23, అక్టోబర్, 2023



క్రీడోత్సవం ప్రారంభం
విజయనగరం వైభవం ఉట్టిపడేలా నిర్వహించే పైడితల్లమ్మ జాతరకు అనుబంధంగా చేపట్టే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

-IIలో



29, 30 తేదీల్లో కబడ్డీ టోర్నీ
ఈ నెల 29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నారు.

-IIలో



రేపటి నుంచి క్రికెట్ సెమీఫైనల్స్
జిల్లా వేదికగా ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 మహిళల అంతర్రాష్ట్ర క్వార్టర్ ఫైనల్స్(మ్యాచ్‌లు) ఆదివారంతో ముగిశాయి.

-IIలో

న్యూస్‌రీల్

సభావేదిక మార్పు
సాలూరు: సాలూరులో నవంబరు 8న జరగబోయే సామాజిక బస్సు యాత్ర ఏర్పాట్లుపై ఈ నెల 29న పట్టణంలో చేపట్టనున్న సన్నాహక సమావేశం సభావేదిక మార్పు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం తెలిపారు. సభావేదిక బైపాస్ రోడ్డులో డంపింగ్ యార్డు దాటిన తరువాత బుడా లేఅవుట్ పక్కన గల ఖాళీ స్థలం వద్దకు మార్పు చేసినట్టు పేర్కొన్నారు. దీన్ని పార్టీ నేతలు, శ్రేణులు గమనించాలని కోరారు. సమావేశానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తదితరులు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు
విజయనగరం అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి జాబితాను ఆదివారం విడుదల చేసారు. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆర్‌వీ సూర్యనారాయణను శ్రీకాకుళం కేఆర్ఆర్‌సీకి బదిలీ చేసారు. అక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.సుమబాలను ఇక్కడికి బదిలీ చేసారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ యూనిట్-2 చీపురుపల్లి ఎల్‌ఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పద్మలతను నేషనల్ హైవే-16 విశాఖకి బదిలీ చేయగా, కాకినాడ ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కె.సుధారాణికి ఇక్కడికి వేసారు. జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.లావణ్యని మాతృ సంస్థ రెవెన్యూకి పంపి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్డీఓగా పోస్టింగ్ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కొవ్వూరు ఆర్‌ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలిని వేసారు. జిల్లా బీసీ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్‌గా మదనపల్లి హెచ్‌ఎన్‌ఎస్ఎస్ యూనిట్-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కిదరి సందీప్‌కుమార్‌ను బదిలీ చేసారు. జిల్లా డిస్పోజల్ డిజార్డర్ మేనేజ్‌మెంట్ శాఖ అధికారిగా శ్రీకాకుళం డీఆర్ఓ ఎం.రాజేశ్వరికి పోస్టింగ్ చేసారు.

దండోరా..
- ఈ నెల 30న తొలేళ్లు, 31న సిరిమానోత్సవం
- ఉత్సవ చాటింపు వేసిన తలయారులు
- అమ్మవారి పండగకు తరలిరండి : ఈఓ



ఆలయం బయట పండుగ చాటింపు వేస్తున్న ఆలయ సిబ్బంది, ఆలయ తలయారీ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి పండగ చాటింపు ప్రక్రియను ఆదివారం సాయంత్రం స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో వేడుకగా నిర్వహించారు. ఆలయ తలయారి చిన రామవరపు పైడిరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మనవి చెప్పిన అనంతరం ఆలయ ఆవరణలో ఈఓ కెఎల్.సుధారాణి నేతృత్వంలో దండోరా వేయించారు. ఈ నెల 30న తొలేళ్ల సంబరాలు, 31న సిరిమానోత్సవం నిర్వహిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటు పల్లి వెంకటరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పైడితల్లి అమ్మవారి పండగను విజయవంతం చేయాలని, పండగకు భక్తులందరూ తరలివచ్చి ఆ తల్లి దివ్యాశీస్సులు అందుకోవాలని ఆలయ ఈఓ కెఎల్ సుధారాణి కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం
విజయనగరం అర్బన్: యూపీఎస్‌సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన/ఆర్థికంగా బలహీన వర్గాల అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూపొందించిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' నూతన పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ మరియు సాధికారత అధికారిణి పి.రత్నం ఆదివారం తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. 'జన్మభూమి.ఏపీ.జీఓవి.ఐఎన్' పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నవంబర్ 4వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహర్దశ





నాడు నేడు అభివృద్ధిపనులు పరిశీలిస్తున్న అధికారులు

- నాడు - నేడుతో జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు
- జిల్లాలో 14 ప్రభుత్వ కళాశాలల్లో శరవేగంగా పనులు
- జిల్లాకు రూ.11.66 కోట్లు మంజూరు
- నాణ్యతలో రాజీ లేకుండా పనులు
- డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చర్యలు

జిల్లాలో కళాశాలలకు మంజూరైన నిధులు...

కళాశాల	మంజూరైన నిధులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల - మక్కువ	రూ. 43,33,661
ప్రభుత్వ జూనియర్ కళాశాల - బలిజిపేట	రూ. 48,66,703
ప్రభుత్వ జూనియర్ కళాశాల - భామిని	రూ. 37,87,349
ప్రభుత్వ జూనియర్ కళాశాల-పాలకొండ(బాలుర)	రూ. 46,06,318
ప్రభుత్వ జూనియర్ కళాశాల -గుమ్మలక్ష్మీపురం	రూ. 28,28,318
ప్రభుత్వ జూనియర్ కళాశాల -పాలకొండ(బాలికలు)	రూ. 36,34,471
ప్రభుత్వ జూనియర్ కళాశాల - కురుపాం	రూ. 26,36,617
ప్రభుత్వ జూనియర్ కళాశాల - పాచిపెంట	రూ. 34,84,169
ప్రభుత్వ జూనియర్ కళాశాల - వీరఘట్టాం	రూ. 24,70,800
ప్రభుత్వ జూనియర్ కళాశాల - సాలూరు	రూ. 46,46,268
ప్రభుత్వ జూనియర్ కళాశాల - పార్వతీపురం	రూ. 49,35,046
ప్రభుత్వ జూనియర్ కళాశాల - సీతానగరం	రూ. 32,61,748
ప్రభుత్వ జూనియర్ కళాశాల - కొమరాడ	రూ. 28,09,248
ప్రభుత్వ జూనియర్ కళాశాల - చినమేరంగి	రూ. 40,09,977

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్ముతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులు, కళాశాలల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తూ తగు చర్యలు తీసుకుంటోంది. నాడు - నేడుతో మొత్తం రూపురేఖలే మార్చివేస్తోంది. కార్పొరేట్‌ను తలదన్నేలా అభివృద్ధి చేస్తూ ఔరా! అని పించుకుంటోంది.

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాలుగేళ్లుగా సర్కారీ బడులను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇంటర్ విద్యపైనా ప్రత్యేక దృష్టి సారించారు. విద్యా రంగంలో పలు పథకాలు అమలుచేస్తూ చదువును ప్రోత్సహిస్తున్నారు. నాడు-నేడులో ప్రభుత్వ జూనియర్ కళాశాలల రూపురేఖలు మారుస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకున్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలు

జూనియర్ కళాశాలలను నాడు - నేడు పథకంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వీటికి మహర్దశ పట్టింది. ఈ మేరకు జిల్లాలో తొలి విడతగా నాడు-నేడులో అభివృద్ధి పనులకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ అభివృద్ధికి నోచుకోని కళాశాలల వివరాలను సేకరించి వాటి అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

కళాశాలల రూపురేఖలు మారుస్తూ..

ఇంటర్మీడియెట్ బోర్డు అధికారుల నివేదికల ఆధారంగా జిల్లాలో 14 ఎంపిక చేసిన కళాశాలల్లో నాడు - నేడు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా కళాశాలల రూపురేఖలు మారుతున్నాయి. కళాశాలల్లో పాత శాలల తరహాలోనే మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ప్రహరీలు, చిన్న, పెద్ద మరమ్మతులు, విద్యుదీకరణ, గ్రీన్ చాక్ బోర్డులు, విద్యార్థులకు, అధ్యాపకులకు అత్యాధునిక బెంచీలు, కుర్చీలు, తరగతి గది లోపల, వెలుపల, ప్రహరీ గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేసే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. డిసెంబర్ నెలలో అన్ని కళాశాలల పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు.

రూ.11.66 కోట్లకు పైగా నిధులతో..

జిల్లా పరిధిలో నాడు - నేడు కింద అభివృద్ధి చేయడానికి 14 కళాశాలలను ఎంపిక చేశారు. కళాశాలల అభివృద్ధికి రూ.11.66 కోట్లు నిధులు కేటాయించగా వాటి నుంచి ఇప్పటికే రూ.9.18 కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో దాదాపు 85 శాతం పనులు పూర్తి చేయడం చకచకా జరిగిపోయాయి. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిన నిధుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కార్పొరేట్ హంగులతో విద్యార్థులను ఆకట్టుకోనున్నాయి.

నాణ్యతలో రాజీ లేకుండా..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న నాడు - నేడు అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు విడతల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. పనులు మధ్యలో ఆగిపోకుండా నిరంతరం కొనసాగేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర బాధ్యులకు జిల్లా కార్యాలయం నుంచి మార్గనిర్దేశం చేస్తున్నాం. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా పనుల స్థితిగతులను గురించి ఆరా తీస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. వచ్చే డిసెంబర్ నాటికి అభివృద్ధి పనులు మొత్తం పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

– మంజులా వీణ, డీవీఈఓ, పార్వతీపురం మన్యం

లక్ష మందికి పైగా...

- జిల్లాలో లక్షా 20వేలకు పైగా లబ్ధిదారుల యాప్ డౌన్‌లోడింగ్, రిజిస్ట్రేషన్
- అర చేతిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వివరాలు
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం





యాప్‌పై ఆరోగ్యశ్రీ కార్డుదారులకు అవగాహన పెంపొందించి యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాలూరు: డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఆరోగ్యశ్రీకి సంబంధించి దాదాపు అన్ని వివరాలు తెలుసుకునే విధంగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ యాప్‌ను రూపొందించింది. జిల్లాలో లక్ష మంది ఈ యాప్ డౌన్‌లోడింగ్ మరియు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో లక్ష్యం దాటింది. ఈ క్రమంలో రాష్ట్రంలో జిల్లాల హౌస్‌హోల్డ్స్ ఆధారంగా అత్యధిక శాతం డౌన్‌లోడ్‌లతో ప్రథమ స్థానంలో నిలవగా, డౌన్‌లోడ్ విభాగంలో ఐదవ స్థానంలో నిలిచింది.

ఏమిటీ ఈ యాప్

ప్రభుత్వం రూపొందించిన ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రజలు వారి ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తరువాత వారి ఆధార్ నంబరు లేదా వారి ఆరోగ్యశ్రీ యుహెచ్ఐడీ నంబరుతో యాప్‌లోకి లాగిన్ కావచ్చు. ఈ యాప్ వలన బహుళ ప్రయోజనాలే ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా తాము చేయించుకున్న చికిత్సలు, వైద్య పరీక్షల వివరాలను లబ్ధిదారులు ఈ యాప్‌లో తెలుసుకునేలా ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. మెడికల్ రిపోర్టులను సైతం భవిష్యత్‌లో కూడా ఈ యాప్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన సమాచారం ఉంటుంది. కార్డుదారులకు అవసరమైన చికిత్సలు ఏయే ఆస్పత్రుల్లో ఉన్నాయి.. తదితర వివరాలన్నింటిని ఆ యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు.

ప్రత్యేక డ్రైవ్

పేదలకు వైద్యాన్ని చేరువ చేసి, ప్రజల వద్దకే వైద్యులను పంపించి ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స అందించే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల నుంచి అనూహ్య స్పందనతో దిగ్విజయంగా జరుగుతున్న కార్యక్రమంలో ఈ యాప్‌పై ఆరోగ్యశ్రీ కార్డుదారులకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విస్తృత అవగాహన పెంపొందిస్తున్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు తమకు కేటాయించిన క్లస్టర్ల పరిధిలో ప్రజల వద్దకు వెళ్లి సర్వేలు చేస్తున్న క్రమంలో ఈ యాప్ ఆవశ్యకతను ఆరోగ్యశ్రీ కార్డుదారులకు వివరిస్తూ, వాటిని డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించే సమయంలో ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రక్రియను వివరిస్తున్నారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌లా ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ పథకం ద్వారా పొందిన చికిత్సల వివరాలను ఈ యాప్‌లో తెలుసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ ద్వారా సదరు కార్డుదారునికి అందించిన చికిత్సకు సంబంధించి ప్రభుత్వం సంబంధిత ఆస్పత్రికి ఎంత మొత్తం చెల్లించింది తదితర వివరాలను ఈ యాప్ ద్వారా ప్రజలు తెలుసుకునే సౌలభ్యం ప్రభుత్వం ఈ యాప్‌లో పొందుపరిచింది.

జిల్లాలో లక్ష దాటిన లక్ష్యం

జిల్లాలో ఈ యాప్ లాగిన్ ప్రక్రియను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలతో గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి కె.రామచంద్రరరావు ప్రత్యేక పర్యవేక్షణలో వారం రోజుల వ్యవధిలోనే లక్షకు పైగా రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. తాజాగా సుమారు లక్షా 20వేలకు దాటింది. జిల్లాలో సుమారు 2లక్షల 50 హౌస్‌హోల్డ్స్' ఉన్న నేపథ్యంలో హౌస్‌హోల్డ్స్ ఆధారంగా, సుమారు 45 శాతంతో రాష్ట్రంలో అగ్రభాగాన మన్యం జిల్లా నిలిచింది.

కలెక్టర్ ఆదేశాలతో..



కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలతో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడింగ్, లాగిన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సహాయ సహకారాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో ఈ డ్రైవ్‌ను చేస్తున్నాం. ఈ యాప్ వలన కలిగే ప్రయోజనాలను ఆరోగ్యశ్రీ కార్డుదారులకు వివరిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసిన వారి సంఖ్య ప్రస్తుతం సుమారు లక్షా 20 వేలు దాటింది. జిల్లాలో హౌస్‌హోల్డ్స్, ఆరోగ్యశ్రీ కార్డుల ఆధారంగా సుమారు 2 లక్షలకు పైగా ఈ యాప్ డౌన్‌లోడింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగాల్సి ఉందని అంచనా. శతశాతం సాధన దిశగా కృషి చేస్తున్నాం. హౌస్‌హోల్డ్స్ ఆధారంగా తీసుకుంటే సుమారు 45 శాతంతో రాష్ట్రంలో మన్యం జిల్లా ముందుంది.

– కె.రామచంద్రరావు, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

బీసీలకు అండగా సీఎం జగన్



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఇతరులు

- గొర్రెల పెంపకందారులకు అండగా ఉంటాం
- తప్పెటగుళ్లు కళాకారులను ప్రోత్సహిస్తాం
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- రూ.కోట్ల రుణం, ఉపకరణాల పంపిణీ

విజయనగరం రూరల్:

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాల (బీసీ) అభ్యున్నతికి అండగా నిలుస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గొర్రెల పెంపకందారులకు జెడ్పీ నిధుల నుంచి కొనుగోలు చేసిన ఉపకరణాలు, డీసీసీబీ నుంచి అందించిన రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులు వారి వృత్తిని కొనసాగించేందుకు అండగా నిలుస్తామని, తప్పెటగుళ్ల కళాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. డీసీసీబీ నుంచి 7 శాతం వడ్డీతో తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లిస్తే వారికి పావలా వడ్డీ వర్తిస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సున్నా వడ్డీ వర్తింపజేసేందుకు కూడా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో యూనిట్ రూ.1.60 లక్షలతో 20 గొర్రెలు, ఒక గొర్రెపోతును కొనుగోలు చేసేందుకు గొర్రెల పెంపకందారులకు ఈ రుణాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు. జెడ్పీ సాధారణ నిధులతో పాటు గొర్రెల పెంపకందారుల వాటాతో 200 మందికి రూ.8.20 లక్షలతో కంచె వల, రెయిన్‌కోట్, టార్చ్‌లైట్‌ను అందించడం జరిగిందని, ఈ ఉపకరణాలు వారికి ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. తప్పెటగుళ్ల అన్నది గొప్ప కళ అని, ముఖ్యంగా యాదవ కులస్తులే ఎక్కువగా ఈ కళలో నిష్ణాతులుగా ఉన్నారని అన్నారు. వారి కళను ప్రదర్శించేందుకు అవసరమైన పరికరాలను, డ్రస్సులను, కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారు.

కుల వృత్తిదారులకు వెన్నుదన్నుగా సీఎం : డిప్యూటీ స్పీకర్

కుల వృత్తిదారుల ఆర్థిక బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి, పెంచుతున్న జీవాల సంరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి ఆ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ ఎంతగానో కృషి చేస్తున్నారని అభినందించారు.

గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కృషి : జెడ్పీ చైర్మన్

గొర్రెల పెంపకందారుల దయనీయ పరిస్థితులను గుర్తించి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సూచనలతో, మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా 50 శాతం సబ్సిడీపై టార్చ్‌లైట్లు, కంచె వలలను, 75 శాతం సబ్సిడీపై రెయిన్ కోట్లును 200 మందికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహకార బ్యాంకు నుంచి సుమారు రూ.5 కోట్లు విలువైన రుణాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యాల కృష్ణ, ఇతర నాయకులు, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, పశు సంవర్థకశాఖ జేడీ డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు, డీడీ వైవీ రమణ, డీసీసీబీ సీఈఓ జనార్దన్, జెడ్పీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్ణ శోభితం



పైడితల్లి అమ్మవారి జాతర ఉత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి ఆలయం విద్యుత్ కాంతులతో అలరారుతోంది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు భక్తులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి : డీఈఓ

పార్వతీపురం టౌన్: ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్ఎంఎంఎస్ 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, విద్య, మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలను తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్కుల్లో ఉండే విధంగా పోర్టల్‌లో నవంబర్ 30లోగా నమోదు చేయాలని సూచించారు. సంబంధిత పాఠశాలల మోడల్ అధికారి డిసెంబర్ 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాల నమోదు తీరును చూడాలని తెలిపారు. నమోదు చేసిన అప్లికేషన్‌ను ప్రింట్ తీసి దాంతోపాటు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీ జతపరచి డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లా మోడల్ అధికారి లాగిన్ ద్వారా వెరిఫై చేయించుకున్న అప్లికేషన్లకు మాత్రమే స్కాలర్‌షిప్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయంపై
హర్షాతిరేకాలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దసరా కానుకగా డీఏ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఉత్తర్వులు విడుదల చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. తమ కుటుంబాల్లో నిజంగా దసరా వచ్చినట్టు ఉందని సంబరపడుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్

హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల తమ సానుకూల వైఖరిని ప్రదర్శిస్తూ రెండు ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదల చేయడం, కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజ్ చేయడంపై ఉత్తర్వులు విడుదల చేయడం హర్షణీయం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కె.త్రినాథరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

రుణపడి ఉంటాం..



కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు చేయడం మా జీవితాల్లో వెలుగులు వచ్చాయి. జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఇచ్చిన మాట నిలబెట్టుకొని మా జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎంకు ధన్యవాదాలు.

– పి.రాజేష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, సాలూరు పీపీ యూనిట్

హర్షదాయకం



రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం డీఏ ప్రకటించడం హర్షదాయకం. 3.64 శాతం డీఏను ప్రకటించడం సంతోషంగా ఉంది. ఆపస్ తరపున కృతజ్ఞతలు.

– జి.రామునాయుడు, ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు

సంతోషం..



దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ ప్రకటించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరించింది. మిగిలిన వాటిని చెల్లించే నిర్ణయాలు తీసుకోవాలి. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే వారు ఇంకా సంతోషిస్తారు.

– బి.రాజగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీఆర్‌టీయూ

డీఏతో హ్యాపీ



ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరుస్తూ డీఏ మంజూరు చేయడం హర్షణీయం. డీఏ వల్ల ఎంతో మేలు జరుగుతుంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేయడం సంతోషం. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– పాలక దేవానంద్, జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, మన్యం జిల్లా

స్వాగతిస్తున్నాం...



ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. డీఏ చెల్లింపు ఈ పరిస్థితుల్లో మంచి నిర్ణయం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఎం.ప్రఫుల్లకుమార్, రాష్ట్ర కౌన్సిలర్, పీఆర్‌టీయూ

క్లుప్తంగా

380 మద్యంసీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి 380 మద్యంసీసాలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకే ఆకస్మిక దాడులు నిర్వహించి, మద్యం విక్రేతను అరెస్ట్ చేయడంతో పాటు మద్యంబాటిళ్లను పట్టుకున్నామని ఎస్‌ఐ హరిబాబునాయుడు తెలిపారు. గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు, పేకాట శిబిరాలు నిర్వహించినా సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

వినతిపత్రం అందజేత



ఏఐఎస్‌ఎఫ్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం ఫూల్‌బాగ్: ఎంసెట్, ఈసెట్ మూడో విడత కౌన్సెలింగ్ తక్షణమే చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నగరంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం మాట్లాడుతూ తొలి రెండు విడతల్లో జరిగిన కౌన్సెలింగ్ దూరప్రాంత కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులంతా తమకు దగ్గరలోని కాలేజీలో సీటు పొందేందుకు మూడో విడత కౌన్సెలింగ్ కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల పేరిట అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, పట్టణ కార్యదర్శి ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుమండల దీక్షలు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో తిరుమండల దీక్షలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి పూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. కామాక్షి అమ్మవారి సన్నిధిలో షోడశీ కళారాధన, శ్రీ చక్రార్చన పూజలు చేశారు. అలాగే చండీ సప్తపతి పారాయణ, లలిత హోమం, వివిధ పరిహార దేవతల హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు.

ఘనంగా క్రీడోత్సవం ప్రారంభం

- 8 రోజుల పాటు.. 16 క్రీడాంశాల్లో పోటీలు
- తొలిరోజు ఉత్సాహంగా వాక్ ఫర్ హెల్త్ పోటీలు
- పైడితల్లమ్మ జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ



వాక్ ఫర్ హెల్త్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సెట్విజ్ సీఈవో రామగోపాల్



క్రీడోత్సవానికి ముస్తాబైన రాజీవ్ స్టేడియం ప్రాంగణం

విజయనగరం: విజయనగరం వైభవం ఉట్టిపడేలా నిర్వహించే పైడితల్లమ్మ జాతరకు అనుబంధంగా చేపట్టే విజయనగరం ఉత్సవాల సందడి ఇప్పటికే ఆరంభం కాగా, ఇందులో భాగంగా స్థానిక సర్ విజ్జీ స్టేడియంలో క్రీడోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. క్రీడల ఖిల్లాగా పేరొందిన విజయనగరం జిల్లాలో క్రీడాకారుల ప్రతిభాపాటవాలను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 8 రోజుల పాటు 16 క్రీడాంశాల్లో సెట్విజ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం వాక్ ఫర్ హెల్త్ పేరిట 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు వారికి 1 కిలోమీటరు వాకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 23న రాజీవ్ క్రీడామైదానంలో ఇదే కేటగిరీలో వాకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. 25న కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో స్విమ్మింగ్ పోటీలు, 26, 27వ తేదీల్లో రాజీవ్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, 26, 27, 28వ తేదీల్లో సర్ విజ్జీ స్టేడియంలో క్రికెట్ పోటీలు, 26, 27వ తేదీల్లో రాజీవ్ స్టేడియంలో ఖోఖో పోటీలు, 28వ తేదీన రాజీవ్ స్టేడియం నుంచి సైకిల్ ర్యాలీ, అయోధ్య మైదానంలో హాకీ పోటీలు నిర్వహించనున్నారు.

అయ్యకోనేరులో వాటర్ స్పోర్ట్స్..

29వ తేదీన రాజీవ్ స్టేడియంలో గాలిపటాలు ఎగురవేసే పోటీలు, అయ్యకోనేరులో వాటర్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహిస్తారు. 29, 30వ తేదీల్లో రాజీవ్ స్టేడియం వేదికగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు.. 30వ తేదీన రాజీవ్ స్టేడియంలో ఫ్లయింగ్ ఆఫ్ బెలూన్స్, తైక్వాండో, ఫెన్సింగ్, కరాటే, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, సంగిరాళ్ల పోటీలు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీలోగా రాజీవ్ స్టేడియంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పించనుమని సెట్విజ్ సీఈవో బి.రామగోపాల్ తెలిపారు.

రేపటి నుంచి క్రికెట్ సెమీఫైనల్స్



సెమీఫైనల్‌కు అర్హత సాధించిన మహారాష్ట్ర జట్టు

- ముగిసిన అండర్-19 మహిళల అంతర్‌రాష్ట్ర క్వార్టర్ ఫైనల్స్
- తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఓటమి
- సెమీస్ బరిలో బరోడా, తమిళనాడు, ముంబై, మహారాష్ట్ర జట్లు

విజయనగరం: జిల్లా వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 మహిళల అంతర్‌రాష్ట్ర క్వార్టర్ ఫైనల్స్(మ్యాచ్‌లు) ఆదివారంతో ముగిశాయి. మొత్తం నాలుగు వేదికల్లో వన్డే తరహాలో హోరా హోరీగా సాగిన మ్యాచ్‌లలో నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అతిథ్య ఆంధ్రా జట్టుతో పాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా జట్లు ఓటమిని చవిచూడగా.. బరోడా, తమిళనాడు, ముంబై, మహారాష్ట్ర జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఈ నెల 24 నుంచి సర్ విజ్జీ స్టేడియం, డెంకాడ మండలంలోని చింతలవలసలో ఉన్న డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్ కాంప్లెక్స్ మైదానాల్లో జరిగే సెమీఫైనల్స్‌లో ఈ నాలుగు జట్లు తలపడనున్నాయి. ఆదివారం పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బరోడా జట్టు 41 పరుగుల తేడాతో విజయం సాధించగా.. సర్ విజ్జీ స్టేడియంలో ఆంధ్రా-తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఎంవీజీఆర్ కళాశాల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హర్యానా జట్టుపై మహారాష్ట్ర జట్టు 99 పరుగుల తేడాతో గెలుపొందగా.. కందుకూరి క్రికెట్ అకాడమీలో జరిగిన మరో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ జట్టుపై ముంబై జట్టు 5 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

'కోట'లో ఎంపిక పోటీలు

శృంగవరపుకోట: స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి, స్థానిక శిరికి రిసార్ట్స్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ పి.శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల నుంచి 180 మంది బాలురు, బాలికలు ఈ క్రీడాపోటీలకు హాజరవుతున్నారని, క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపిక పోటీలకు వచ్చే వారు క్రీడాదుస్తులు, షూస్, రాకెట్లు ఎవరివి వారే తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7989199534, 9490265104ను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న డీఎఫ్‌వో ప్రసూన

పార్వతీపురం టౌన్: పార్వతీపురం అటవీ శాఖ పరిధిలోని బేస్ క్యాంపు ఉద్యోగిగా పనిచేస్తూ మృతి చెందిన కోటేశ్వరరావు భార్య వరలక్ష్మికి రూ.55,000 ఆర్థికసాయాన్ని డీఎఫ్‌వో జి.ఎ.పి.ప్రసూన ఆదివారం అందజేశారు. అటవీ శాఖ అసోసియేషన్ నుంచి సాయం అందించామని డీఎఫ్‌వో తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా రావాల్సిన పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారి మనోజ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: దిశ మహిళా పోలీస్ సెల్‌ఫోన్ లాక్కొని, పరారైన దొంగను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.. దిశ పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న దివ్యజ్యోతి విధులు ముగించుకుని, స్టేషన్ బయటకు రోడ్డు వైపు వస్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె చేతిలోని సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. అప్రమత్తమైన ఆమె వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా, కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పూల్‌బాగ్‌కి చెందిన కోట అమరనాథ్ అనే వ్యక్తిగా అతడిని గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిస కావడంతో ఇలా దొంగతనాలకు పాల్పడుతున్నాడని దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



పీఎం పాలెం: ఘటన స్థలంలో మృతి చెందిన హేమలత

పీఎం పాలెం: ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గేదెల హేమలత(32) అనే మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లాలోని గజపతినగరం మండలం, మరుపల్లికి చెందిన హేమలత భర్త రైల్వే ఉద్యోగి కాగా, తన ఇద్దరు పిల్లలతో కలిసి మధురవాడలో నివసిస్తోంది. నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వరసకు సోదరుడైన యర్రా నారాయణరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి అదే రోడ్డులో విజయనగరం నుంచి వస్తున్న ఆర్‌టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వెనక కూర్చొని ఉన్న హేమలత ఒక్కసారిగా కిందపడడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. దీంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచింది. వాహనం నడుపుతున్న నారాయణరావుకు గాయాలు కాగా, గీతం ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త రైల్వే ఉద్యోగి. నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శృంగవరపుకోట: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ దొంతల ఈశ్వరరావు అనే వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరావు కొన్నాళ్లుగా మద్యానికి బానిస కావడంతో ఈ నెల 20వ తేదీన అతడి భార్య మద్యం తాగొద్దని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పురుగుమందు తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.కోట ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు.

నాగావళి నదిలో విద్యార్థి గల్లంతు



నది వద్ద గుమిగూడిన స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు



జి.అవినాష్(ఫైల్)

సంతకవిటి: స్నానానికి నదిలో దిగిన విద్యార్థి గంటా అవినాష్(21) గల్లంతైన ఘటన మండలంలోని తుమరాం గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారి కాలనీకి చెందిన అవినాష్ స్నేహితులతో కలిసి సరదాగా నదీ తీరానికి వెళ్లాడు. అక్కడ వారు కాసేపు ఆటపాటలతో గడిపిన తర్వాత నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి అవినాష్ జారుకుని గల్లంతై ఉంటాడని అతడి స్నేహితులు చెబుతున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో దిగి, గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు.

● దొర.. గుర్రం సవారీ..

భామిని కీర్తిరాయి దొరలు చేసే దసరా ఉత్సవాలు ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రత్యేకం. అప్పటి వారి పూర్వీకుల ఆచారవ్యవహారాల ప్రకారం చేసే పూజా విధానాలు, సంప్రదాయ వస్త్రధారణ ఒక్కసారిగా మనల్ని అప్పటి కాలానికి తీసుకువెళ్తాయి. ఆదివారం సరిగ్గా ఇదే దృశ్యం కనిపించింది. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ భామిని దొర గుర్రంపై సవారీ చేసుకుంటూ తివ్వాకొండలకు వెళ్లి, అక్కడి కోటకొండ దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన దొరను, వారు అనుసరిస్తున్న పూజా విధానాలను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

–భామిని



గుర్రం సవారీ చేసుకుంటూ వెళ్తున్న భామిని దొర

29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ టోర్నీ

- విజేతలకు రూ.65 వేల నగదు ప్రోత్సాహకం
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని, ఈ నెల 29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సెట్విజ్ సీఈవో బి.రాంగోపాల్‌తో కలిసి మాట్లాడిన ఆయన మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ప్రోత్సాహంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో, మ్యాట్‌పై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.30 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.20 వేలు, తృతీయ బహుమతి కింద రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నామన్నారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 26వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపాలని కోరారు. క్రీడాకారులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9573363564, 8074858972ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.సూరిబాబు, క్రీడా సంఘాల ప్రతినిధులు బి.రామారావు, డి.అచ్యుతరావు, కె.ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

- వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 67వ స్కూల్ గేమ్స్ పోటీలకు సంబంధించి, అండర్-14, అండర్-17 విభాగాల బాల,బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 25, 26, 27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 25న విజయనగరం జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో అండర్-14, అండర్-17 బాల,బాలికల విభాగాల్లో స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని, 26న ఎస్.కోటలోని సిరికి రిసార్ట్స్‌లో అండర్-14, అండర్-17 బాల,బాలికల షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు, 27న కొత్తవలసలో అండర్-14 బాల,బాలికల విభాగాల్లో వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్ణీత వయసు కలిగి, ప్రస్తుతం పాఠశాల విద్యనభ్యసిస్తున్న వారంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లా జట్లకు అర్హత సాధించే క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగబోయే అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆపస్' నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం అర్బన్: స్థానిక సేవాభారతి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నూతన కార్యవర్గం ఏర్పాటు ఆదివారం జరిగింది. సభ్యులు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వి.వి.జె.సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడిగా వి.వి.శ్రీహరి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎ.జి.తాతారావు, ఉపాధ్యక్షులుగా వి.సత్యనారాయణ, ఎం.వెంకటనాయుడు, కె.భాస్కరరావు, ఎం.రమణ, ఎస్.వి.ఎస్.కృష్ణారావు, కె.సంతోషలక్ష్మి, కార్యదర్శులుగా సి.హెచ్.సోమయాజులు, ఆర్.అప్పలనాయుడు, డి.సోమిరాజు, కె.సాయికుమార్, ఎ.కృష్ణవేణి, ఎ.కిరణ్‌కుమార్, కార్యవర్గసభ్యులుగా పి.వి.గణపతిరావు, పి.సత్యారావు, సి.హెచ్.పద్మలత, కె.నాగరాజు, పి.శ్రీరంగాచార్యులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా ఆర్.ఎస్.ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ మానవీయ డి.వి.వి.కృష్ణంరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ పూర్వ అధ్యక్షుడు ఇ.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీసీ సాధికారిత బస్సుయాత్ర నేపథ్యంలో పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ సీపీ భారీ బహిరంగ సభ సోమవారం నిర్వహించనున్నారు. ఈ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సమావేశానికి హాజరై, పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేయనున్నారు. దాదాపు ఆరు వేల మందికి పైగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరుకానున్నారని సమాచారం.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చెరువులో తేలియాడుతున్న వ్యక్తి మృతదేహం

తెర్లాం: మండలంలోని గొలుగువలస గ్రామానికి సమీపంలోని లింగిభేరివాని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడి మృతదేహం పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. మృతుడి వివరాలు తెలియరావాల్సి ఉందని, మృతుడు ఎరుపురంగు షర్టు, నల్లరంగు ప్యాంటు వేసుకున్నాడని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సురేంద్రనాయుడు తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహం తరలించామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

Ready to Occupy 2 BHK Flat 1250 Sft Car parking @ R&B Guest House Road, Alakanandha Colony, VZM. Ph : 92466 24248, 98494 73817 [V-797434]

PLOT FOR SALE

గజం-4500/- మాత్రమే, VZM to గజపతినగరం (NH-43) హైవేకి కేవలం 3KM దూరంలో 120 ఎకరాల గల లే-అవుట్‌లో స్థలములు కలవు. (రిసార్ట్ కూడా కలదు) 8074200925 [S-1220346]

KVR Estates Mega Gated Community KVR Sarvan Nivas, KVR Sakthidhar Layout లో Luxury Plots, Houses కలవు. ఫోన్ : 94937 07594 [V. 797376]

BUSINESS OFFER

ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

SERVICES

వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సంప్ర: 9034053557 [T-181]

WANTED

రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను. భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

ప్రముఖ కంపెనీలో జిల్లా/మండలాల వారిగా పనిచేయుటకు కో ఆర్డినేటర్లు కావలెను. Sal: 20,000 ఆపైన, Send Resume వాట్సాప్. ✆ 7330552222. [T-1177903]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7995385999 [HA-751]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

